సాక్షి
శ్రీకాకుళం
ఆదివారం । 16 । జూలై । 2023

అన్ని రకాల 22 kt (916) బంగారు ఆభరణాలపై
5th Anniversary EXCITING OFFER
NO తరుగు (VA)*
NO మజూరి
NO GST మీ తరుపున మేమే చెల్లిస్తాము
PAY ONLY 24KT GOLD / BULLION PRICE
ఈ ఆఫర్ జూలై 23 వరకు వర్తిస్తుంది
సాధారణ వెండి వస్తువులపై NO తరుగు మజూరి + GST
CONTACT : +91 74 9666 9666



న్యూస్‌రీల్

శారీరక శ్రమకు క్రీడలు అవసరం



విద్యార్థిని అభినందిస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం రూరల్: శారీరక శ్రమకు క్రీడలు ఎంతో దోహదపడతాయని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. మండల పరిధిలోని వప్పంగి గ్రామంలో గల ఓ కల్యాణ మండపంలో శనివారం రాష్ట్రస్థాయి ఉషూ క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి. కార్యక్రమానికి ధర్మాన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. చదువుతో పాటు నేటితరం పిల్లలు క్రీడలకు సమయం కేటాయించాలన్నారు. పోటీలు నిర్వహించిన వారిని అభినందించారు. 13 జిల్లాల నుంచి 285 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఉషూ అసోసియేషన్ ప్రతినిధులు రెడ్డి శివకుమార్, కొరమ భాస్కరరావు, క్రిష్టప్పనాయుడు, వాకర్స్ ప్రతినిధులు ఇందిరాప్రసాద్, జోగినాయుడు, ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్స్ సురేఖ, రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

చెక్‌పోస్టులో ఇక నగదు రహిత లావాదేవీలు



చెక్‌పోస్టు వద్ద నగదు రహిత సేవలపై అవగాహన కల్పిస్తున్న డీటీసీ శివరామప్రసాద్

ఇచ్ఛాపురం: ఆంధ్రా–ఒడిశా సరిహద్దులోని పురుషోత్తపురం చెక్‌పోస్టు వద్ద ఆర్టీఓ కార్యాలయంలో నగదు రహిత లావాదేవీలు ప్రారంభమైనట్లు డిస్ట్రిక్ట్ ట్రాన్స్‌పోర్టు కమిషనర్(డీటీసీ) శివరామప్రసాద్ తెలిపారు. ఆయన శనివారం పురుషోత్తపురం చెక్‌పోస్టుని తనిఖీ చేశారు. అనంతరం లారీ డ్రైవర్లతో కార్యాలయం వద్ద నగదు రహిత లావాదేవీలకు సంబంధించిన క్యూఆర్ కోడ్‌పై అవగాహన కల్పించారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో అక్రమాలకు చెక్ పడుతుందన్నారు. ఈ నెల 12 నుంచి నగదు రహిత లావాదేవీలను ప్రారంభించినట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా చెక్‌పోస్టుల్లో ఈ సేవలు అందుబాటులోకి వచ్చాయన్నారు. డ్రైవర్లకు పూర్తి అవగాహన కలిగే వరకు చెక్‌పోస్టుల వద్ద 3 ప్రైవేట్ కామన్ సర్వీస్‌సెంటర్(సిఎస్‌సి) ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

గరిమెళ్ల స్ఫూర్తిప్రదాత



విద్యార్థులకు గరిమెళ్ల మెరిట్ అవార్డులు అందజేస్తున్న బాడాన రాజు

పోలాకి: స్వాతంత్య్ర సమరయోధుడు, జాతీయ కవితా సార్వభౌముడు గరిమెళ్ల సత్యనారాయణ 130వ జయంతి సందర్భంగా ఆయన స్వగ్రామం ప్రియాగ్రహారంలోని ఆయన విగ్రహానికి స్థానికులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గరిమెళ్ల ట్రస్ట్ కార్యదర్శి బాడాన రాజు మాట్లాడుతూ జాతీయోద్యమ సమయంలో సిక్కోలు పౌరుషాన్ని చూపిన స్ఫూర్తి ప్రదాత గరిమెళ్ల అని అన్నారు. నేటితరం గుర్తుంచుకునేలా జయంత్యుత్సవాన్ని ప్రభుత్వం నిర్వహించాలని కోరారు. ఈ సందర్భంగా స్థానిక ప్రభుత్వ పాఠశాల, కళాశాలల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు గరిమెళ్ల మెరిట్ అవార్డులు అందజేశారు. ఎంపీటీసీ సుంకరి ప్రసాదరావు మాట్లాడుతూ ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ చొరవతో గరిమెళ్ల పేరు మీద ఉన్న కళాశాల, పాఠశాలల్లో నాడు–నేడు ద్వారా అభివృద్ధి చేస్తున్నామని, భవిష్యత్‌లో వృద్ధాశ్రమం, అనాథాశ్రమం ఏర్పాటు చేయడానికి సన్నాహాలు చేస్తున్నామని చెప్పారు.

బస్‌తీ మే సవాల్!

- పాతపట్నంలో టీడీపీ బస్సు యాత్రకు మామిడి వర్గం గైర్హాజరు
- ఆహ్వానం లేదని దూరంగా ఉండిపోయిన వైనం
- యాత్రను మమ అనిపించేసిన కలమట వర్గం

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం :

టీడీపీ బస్సు యాత్రకు మొదటి రోజే గ్రూపు రాజకీయాలు స్వాగతం పలికాయి. పాతపట్నంలో మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ తీరుకు నిరసనగా మామిడి గోవిందరావు వర్గమంతా యాత్రకు దూరంగా ఉండిపోయింది. పిలవని పేరంటానికి వెళ్లి తన్నుకోవడం తప్ప మరో ప్రయోజనం ఉండదని మామిడి వర్గీయులంతా తమ ఇళ్లకే పరిమితమయ్యారు. దీంతో వచ్చిన కొద్ది మందితోనే యాత్రను మమ అనిపించేశారు.

రెండుగా చీలిపోయి..

పాతపట్నం టీడీపీలో విభేదాలు అందరికీ తెలిసిందే. గత ఎన్నికల్లో గెలిపించుకున్న ప్రజల్ని మోసగించి, టీడీపీ ఇచ్చిన ప్యాకేజీ తీసుకుని, పార్టీ ఫిరాయించిన కలమట వెంకటరమణ వర్గం ఒకటైతే, కొత్త నాయకత్వం వహిస్తున్న మామిడి గోవిందరావు వర్గం మరొకటి. వీరిద్దరి గ్రూపు రాజకీయాలతో అక్కడి టీడీపీ కేడర్ రెండుగా చీలిపోయింది. కలమట వెంకటరమణను ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు, ఎమ్మెల్యే అచ్చెన్నాయుడు ప్రోత్సహిస్తుండగా, మామిడి గోవిందరావును కళా వెంకటరావు ద్వారా నేరుగా నారా లోకేష్ నడిపిస్తున్నారు. గతంలో కింజరాపు అచ్చెన్నాయుడు అనుసరించిన తీరు సంచలనం కూడా అయింది. మామిడి గోవిందరావు బాగా ఖర్చు పెడతారని, పార్టీకి కూడా ఎప్పటికప్పుడు ఫండింగ్ ఇస్తున్నాడని, వాడిని వాడుకుని నిన్ను బలపరుస్తామని నిమ్మాడలో బాహాటంగానే కలమట వెంకటరమణ వద్ద కింజరాపు అచ్చెన్నాయుడు చెప్పుకొచ్చిన విషయం తెలిసిందే. వాడుకుని వదిలేయడమే తప్ప టిక్కెట్ ఇచ్చే ప్రసక్తే లేదని తెగేసి చెప్పేశారు. అప్పుడే విషయం తెలుసుకున్న మామిడి గోవిందరావు నేరుగా లోకేష్‌ను నమ్ముకుని రాజకీయాలు చేస్తున్నారు. కింజరాపు ఫ్యామిలీ ఆడుతున్న డబుల్ గేమ్‌ను తన అనుయాయుల వద్ద పంచుకున్నారు. రానున్న ఎన్నికల్లో ఎంపీగా పోటీచేయనున్న రామ్మోహన్ నాయుడుకు తన సత్తా ఏంటో చూపిస్తానని కేడర్ వద్ద చెప్పినట్లు సమాచారం.



ముందస్తు సమాచారంతోనే..

తాజాగా టీడీపీ బస్సు యాత్ర శనివారం ఆ నియోజకవర్గంలో ప్రారంభమైంది. నియోజకవర్గంలో ప్రవేశించిన బస్సు యాత్రకు రెండు గ్రూపులు వచ్చి స్వాగతం పలుకుతాయని జిల్లా టీడీపీ శ్రేణులు భావించాయి. కానీ మామిడి గోవిందరావు వర్గానికి ముందుగా ఆహ్వానం రాలేదు. మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ అంతా తానై వ్యవహరించారు. ఈ నేపథ్యంలో యాత్రలో పాల్గొని అవమానం పాలవ్వడం కంటే వెళ్లకపోవడమే మంచిదని బాయ్‌కాట్ చేశారు. పార్వతీపురం మన్యం జిల్లాలో టీడీపీ బస్సు యాత్ర చేసినప్పుడు అక్కడ నియోజకవర్గ ఇన్‌చార్జి నిమ్మక జయకృష్ణ తనకు ప్రత్యర్థిగా ఉన్న వర్గమంతటినీ బస్సులోకి రానీయకుండా అడ్డుకున్నారు. ఈ సందర్భంగా పెద్ద తోపు లాటే జరిగింది. ఈ సందర్భంగా తన పోటీదారులను నిమ్మక జయకృష్ణ అడ్డుకుని విజయం సాధించారు. పాతపట్నంలో కూడా అదే ట్రీట్‌మెంట్ ఇవ్వాలని కలమట వెంకటరమణ ముందుగానే సంకేతాలు పంపించినట్టు తెలిసింది. అందులో భాగంగానే యాత్రకు ముందు రోజు అప్పటికే దారి పొడవునా ఉన్న మామిడి గోవిందరావు ఫ్లెక్సీలు, కటౌట్‌లను తొలగించారు. ఆ మధ్య జరిగిన పార్టీ మినీ మహానాడులో ఎలాగైతే వేదికపైకి రానీవ్వకుండా మామిడి గోవిందరావును అడ్డుకున్నారో అదే రకంగా బస్సు యాత్రలో కూడా చేద్దామని కలమట భావించినట్టుగా మామిడి వర్గానికి తెలిసింది. అసలే ఆహ్వానం లేని కార్యక్రమం, ఆపై పిలవని పేరంటానికి వెళ్తే కలమట హడావుడి చేస్తారు. వెళ్లి అవమాన పడటం, మాటామాటా పెరిగి తన్నుకోవడం కంటే వెళ్లకపోవడమే మంచిదని మామిడి గోవిందరావు వర్గమంతా బస్సు యాత్రకు గైర్హాజరై నిరసన తెలిపింది. దీంతో వ్యయప్రయాసలతో సమకూర్చిన మనుషులతో కలమట తమ బస్సు యాత్రను ముందుకు తీసుకెళ్లారు.

బస్సు యాత్రలో ప్రజల కష్టాలు

మెళియాపుట్టి: మండలంలోని చాపర గ్రామంలో టీడీపీ బస్సు యాత్రను నిర్వహించారు. పలాస వెళ్లే ముఖ్య రహదారిలో సభ నిర్వహించడంతో జనం ఇబ్బంది పడ్డారు. అచ్చెన్న మాట్లాడుతున్న సమయంలో ఒక అంబులెన్స్ అరగంట పాటు నిలిచిపోయింది. ఎంపీ రామ్మోహన్‌నాయుడు కలమటను ఎమ్మెల్యే అభ్యర్థిగా చెప్పారు. దీంతో మామిడి వర్గంలో నిరాశ మొదలైంది.



బస్సు యాత్ర మధ్యలో ఇరుక్కున్న అంబులెన్స్

హమ్మయ్య.. ఎలుగు చిక్కింది



ఎలుగుకు ట్రాంక్విలైజర్‌తో మత్తు మందిస్తున్న దృశ్యం (ఇన్‌సెట్లో) ఎలుగు ఇదే..

మందస: ఉద్దానంలో హల్‌చల్ చేసిన ఎలుగుబంటి ఎట్టకేలకు బోనుకు చిక్కింది. ఇటు అటవీ శాఖాధికారులు, అటు పోలీసులను శుక్రవారం నానా తిప్పలు పెట్టిన ఎలుగును శనివారం మత్తు మందు ఇచ్చి పట్టుకున్నారు. మందస మండలంలోని ఉద్దాన ప్రాంతమైన లోహరిబంద పంచాయతీ యశోదనగర్ మెట్ట వద్ద ఎలుగు ప్రదక్షిణలు చేస్తూ రోజంతా ఒకే చోట తిరుగుతుండడంతో స్థానికులు పెద్ద ఎత్తున సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఎలుగును పట్టుకోవడానికి డీఎఫ్‌ఓ నిషాకుమారి, సిబ్బంది విఫలయత్నం చేశారు. శనివారం కూడా ఎలుగు అదే తీరున తిరుగుతూ ఉండడంతో విశాఖ జూ నుంచి వచ్చిన డాక్టర్ ఫణీంద్రకుమార్ ఆధ్వర్యంలో ఎలుగుకు ట్రాంక్విలైజర్ షూట్‌తో మత్తు మందును ఇచ్చారు. అది నిద్రలోకి ఎలుగు జారుకోగానే అటవీశాఖ సిబ్బంది పట్టుకుని, బోనులో బంధించారు. 15 నిమిషాల అనంతరం యాంటీడోస్‌ను ఇచ్చి, వ్యాన్‌లో విశాఖపట్నంలోని జూకు తరలించారు.

రూ.28 కోట్లతో నాడు–నేడు పనులు

సారవకోట: జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో రూ.28 కోట్లతో నాడు–నేడు పనులు జరుగుతున్నాయని ఇంటర్ బోర్డు డీవీఈఓ తోట ప్రకాశరావు తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 38 కళాశాలల అభివృద్ధికి ప్రభుత్వం రూ.28 కోట్లు కేటాయించిందని తెలిపారు. నెలాఖరు నాటికి పనులు పూర్తి చేయాలని సూచిస్తున్నామన్నారు. ఈ ఏడాది జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 5 వేలు వరకు అడ్మిషన్లు అయ్యాయని, కొన్ని కళాశాలలో తక్కువగా అడ్మిషన్లు అవుతున్నాయన్నారు. ఆయనతో పాటు కళాశాల ప్రిన్సిపల్ విశ్వ ప్రసాద్ ఉన్నారు.

సాయం మరువలేం

వలంటీర్ల సాయాన్ని లబ్ధిదారులు మరువలేకపోతున్నారు. కోవిడ్ వంటి కష్టకాలంలో, ఆ తర్వాత వచ్చిన అనేక సందర్భాల్లో వలంటీర్ వ్యవస్థ వల్ల జరిగిన మేలును అంతా గుర్తుంచుకున్నారు. సంక్షేమ పథకం లబ్ధి పొందడానికి ఎవరిని అడగాలో, ఏం చేయాలో తెలీని స్థితిలో వలంటీర్లే తమను ఆదుకున్నారని చెబుతున్నారు.

–కోటబొమ్మాళి, నరసన్నపేట

ఆపద సమయంలో..



కరోనా సమయంలో మక్క మరిడయ్య ఇంటి వద్ద వలంటీరు కూర్మాపు సింహాచలం(ఫైల్)

మాది కోటబొమ్మాళి మండలం కొత్తపేట గ్రామం. నా పేరు మక్క మరిడయ్య. కరోనా సమయంలో నాతో పాటు మా వీధిలో మరో ఐదు కుటుంబాల వారికి వ్యాధి సోకింది. మేము ప్రాణాపాయ స్థితికి వెళ్లిపోయాం. కోవిడ్‌కు భయపడి ఎవరూ మాకు సాయం చేసేందుకు ముందుకు రాలేదు. మేం హోమ్ క్వారంటైన్‌లో ఉన్నప్పుడు మా వలంటీర్ సింహాచలం కన్న కొడుకులా మాకు సేవలు చేశాడు. మందులు, కూరగాయలు, కిరాణా సామగ్రిని మాకు అందించేవాడు. కానీ దురదృష్టవశాత్తూ అతనికి కూడా కోవిడ్ వచ్చి ఆస్పత్రి పాలయ్యాడు. ఆ తర్వాత దేవుడి దయ వల్ల అంతా బయటపడ్డాం. ఇప్పటికీ మా వలంటీర్ తలలో నాలుకలా అన్ని పనులూ చక్కబెడుతున్నాడు.

వలంటీర్ వచ్చాకే..



నా భర్త లచ్చయ్య తలయారీగా పనిచేస్తూ మరణించారు. నాకు ఆయన మరణానంతరం పెన్షన్ వచ్చేది కాదు. ప్రభుత్వపరంగా వృద్ధాప్య పింఛన్ కూడా రాలేదు. ఎన్ని దరఖాస్తులు పెట్టినా ప్రయోజనం లేకపోయింది. అలాంటి పరిస్థితుల్లో మా వలంటీర్ కొంక్యాణ నాగరాజు వచ్చి నా సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లాడు. పింఛన్ కోసం సచివాలయంలో దరఖాస్తు చేయించాడు. ఇప్పుడు నాకు పింఛన్ వస్తోంది. నా కుమారుడు దుర్గారావు రేషన్ కార్డు కోసం కూడా ఎంతో ప్రయాస పడ్డాం. కానీ వలంటీర్ వ్యవస్థ వచ్చాకే రేషన్ కార్డు కూడా వచ్చింది.

– చెన్న లచ్చెమ్మ, ఎస్సీ కాలనీ, సత్యవరం, నరసన్నపేట

అధికారంలో మౌనం.. ఇప్పుడు విమర్శల గానం

- అరవై ఏళ్ల పాలనలో అభివృద్ధి ఊసెత్తని 'గౌతు' కుటుంబం
- నిజం తెలుసుకుని ఓడించిన పలాస ప్రజలు
- సీదిరి హయాంలో ఉద్యమంలా ప్రగతి పనులు
- నేడు పలాసలో టీడీపీ బస్సు యాత్ర
- నాడు పనులు చేయకుండా నేడు యాత్రలెందుకంటున్న ప్రజలు

కాశీబుగ్గ, వజ్రపుకొత్తూరు:

స్వాతంత్య్రం వచ్చి 75 ఏళ్లయినా సిక్కోలు ఇంకా వెనుకబడిన జిల్లాగానే గుర్తింపు పొందింది. ఇందులో ఐదారు దశాబ్దాల పాటు 'గౌతు' కుటుంబమే పలాస, అప్పట్లో సోంపేట నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించింది. జిల్లా వెనుకబాటుకు వారి పాలనే కారణమని ఈ లెక్కలు చెప్పకనే చెబుతున్నాయి. ముఖ్యంగా టీడీపీ నుంచి పోటీ చేసి వరుసగా గెలిచిన గౌతు శివాజీ పాలన తీరు నచ్చకనే ప్రజలు 2019లో సీదిరి అప్పలరాజుకు ఓటేసి గెలిపించారు. అప్పటి నుంచి ఈ నియోజకవర్గంలో అభివృద్ధి పనులు జోరుగా జరుగుతున్నాయి. ఇప్పుడు శివాజీ కుమార్తె గౌతు శిరీష మళ్లీ పసుపు జెండా పట్టుకుని బస్సు యాత్ర అంటూ జనం ముందుకు వస్తున్నారు. గౌతు శివాజీ చివరిసారి ఎమ్మెల్యేగా పనిచేసిన సమయంలో ఆయన అల్లుడు చేసిన పనులు ఇంకా ఎవరూ మరువలేదు. శివాజీ ఒక వైపు ప్రభుత్వ కార్యక్రమానికి హాజరైతే అల్లుడు, కుమార్తె చెరోవైపు తిరుగుతూ ప్రభుత్వ/ప్రైవేటు కార్యక్రమాలు చేసేవారు. అభివృద్ధి అంటే శిలాఫలకాలు వేయడం మాత్రమేనని వీరి నిశ్చితాభిప్రాయం. మాటివ్వడం..మర్చిపోవడం దశాబ్దాలుగా వీరు ఇక్కడ చేసిన రాజకీయం. అధికారంలో ఉన్నప్పుడు మౌనం వహించి.. ఇప్పుడు యాత్రలు చేసి లాభమేంటని పలాస ప్రజలంటున్నారు.



పలాస–గొప్పిలి దారిలో టీడీపీ వేసిన శంకుస్థాపన శిలాఫలకం

రూ.2వేల కోట్లతో అభివృద్ధి



పలాస నియోజకవర్గంలో సీదిరి అప్పలరాజు రూ.2వేల కోట్లతో అభివృద్ధి పనులు నిర్వహించారు. తెలుగుదేశం నాయకులు జరిగిన ఈ అభివృద్ధిని చూసి ఓర్వలేకపోతున్నారు. వాటర్ గ్రిడ్, కిడ్నీ రీసెర్చ్ సెంటర్లు అతి పెద్దవి. ఎన్నికల ముందే సీఎం చేతులమీదుగా ప్రారంభం కానున్నాయి

– దబ్బీరు భవానీశంకర్, మాజీ కౌన్సిలర్, పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ

టీడీపీ చేసిందేమిటి?



తెలుగుదేశం పార్టీ హయాంలో ఒక్క శాశ్వత అభివృద్ధి పని చేయలేదు. ఏ ముఖం పెట్టుకుని ఓట్లు అడగడానికి వస్తారో చెప్పాలి. గౌతు శిరీష నాన్ లోకల్. శివాజీ అల్లుడు విశాఖలో ఉంటారు. టీడీపీ నాయకులను ఎవరూ నమ్మే పరిస్థితి లేదు.

– బదకల బాలమ్మ, మాజీ కౌన్సులర్, పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ

టీడీపీ హామీలివి..



శిలాఫలకానికే పరిమితమైన తేరపల్లి రహదారి

హామీల మూటలు

- మందస మండల కేంద్రంలో రోడ్లు వేస్తామని చెప్పి ఏళ్లకు ఏళ్లు కాలం గడిపారు.
- వజ్రపుకొత్తూరు మండలంలోని వెంకటాపురం, అక్కుపల్లికి పీహెచ్‌సీలు నిర్మిస్తామని చెప్పి నిధులు ఇవ్వలేక నిర్మించలేకపోయారు.
- రూ.70 కోట్ల ప్రపంచ బ్యాంకు నిధులతో పలాస–కాశీబుగ్గ జంటపట్టణాలకు తాగునీరు అందిస్తామని మాటిచ్చి చివరకు వదిలేశారు.
- కాశీబుగ్గ ఎల్‌సీ గేటు వద్ద ఫ్లై ఓవర్ వంతెన పూర్తి చేస్తామని కనీస పనులు కూడా చేయలేదు.
- పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీతోపాటు వజ్రపుకొత్తూరు, మందస, పలాస మండలంలో రైతు బజారు నిర్మాణానికి శంకుస్థాపన చేసి పనులు గాలికి వదిలేశారు.
- కోతారింగుతాళభద్ర గ్రామానికి తారురోడ్డు వేయడానికి శివాజీ శంకుస్థాపన చేసి క్రషర్ బుగ్గి మాత్రమే వేసి వదిలేశారు.
- ఐదేళ్లలో ఆఫ్‌షోర్ పూర్తి చేస్తామని చెప్పి చేయలేక.. గడ్డం దీక్షలంటూ ప్రజలను వంచించారు.
- రూ.12 కోట్లతో పలాస నుంచి గొప్పిలి వరకు సుమారు 10 కిలోమీటర్ల డబుల్ రోడ్డుకు నిధులు మంజూరయ్యాయి. నిర్మాణ పనులు మాత్రం పూర్తి కాలేదు.
- బెండికొండ వద్ద మినీ స్టేడియం నిర్మిస్తామని కనీసం స్థల పరిశీలన కూడా చేయలేదు.
- 2018లో వజ్రపుకొత్తూరు మండలంలోని గుళ్లలపాడు, శివరాంపురం, తేరపల్లి, గంగయ్యవానిపేట, యాజీపురం తదితర గ్రామాలకు రూ.5 కోట్లు వెచ్చించి రహదారులు నిర్మిస్తామని అప్పటి ఎమ్మెల్యే గౌతు శ్యామసుందర శివాజీ శంకుస్థాపన చేశారు. ఒక్క రోడ్డూ పూర్తి చేయలేక చేతులెత్తేశారు.

వైఎస్సార్ సీపీ హయాంలో..

అభివృద్ధి జాడలు

- మందస మండల కేంద్రంలోని రోడ్డు నిర్మాణం పూర్తి చేశారు.
- రూ.4కోట్లతో వెంకటాపురం, అక్కుపల్లి పీహెచ్‌సీల నిర్మాణాలు పూర్తి చేశారు.
- రూ.100.09 కోట్లతో పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీకి అర్బన్ వాటర్ స్కీంతో ఇంటింటికి తాగునీరు అందిస్తున్నారు.
- రూ.18 కోట్లతో కాశీబుగ్గ రైల్వే ఫ్లై ఓవర్ పునఃనిర్మాణ పనులు చేపడుతున్నారు. బాధితులకు రూ.4 కోట్ల 34లక్షలు ఆర్ అండ్ అర్ ప్యాకేజీ, విలువైన ఇంటి స్థలాలు అందజేశారు.
- కాశీబుగ్గ–వజ్రపుకొత్తూరు, నువ్వలరేవు–బెండిగేటు మీదుగా రేగులపాడుకు బీటీ రోడ్లు వేశారు. ఏఎంసీ నిధులతో వంతెనలు కట్టారు.
- రూ.860 కోట్లతో ఆఫ్‌షోర్ ప్రాజెక్ట్ పునఃనిర్మాణం జోరుగా జరుగుతోంది.
- రూ.700 కోట్లతో కిడ్నీరోగుల కోసం ఇంటింటికి తాగునీటి ప్రాజెక్టును ఏర్పాటు చేశారు.
- రూ.50 కోట్లతో కిడ్నీ రీసెర్చ్ అండ్ 200 పడకల సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి కట్టారు.
- మంచినీళ్లపేటలో రూ.12.5 కోట్లతో జెట్టీ కడుతున్నారు. రూ.8 కోట్లతో వజ్రపుకొత్తూరు మండలం నువ్వలరేవు–మంచినీళ్లపేటల మధ్య జెట్టీ నిర్మాణం పనులు జరుగుతున్నాయి. దీన్ని మినీ ఫిషింగ్ జెట్టీ కింద మార్చనున్నారు.
- పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ విస్తరణ, డ్రైన్, ఫుట్‌పాత్ రూ.4 కోట్లతో పనులు చేస్తున్నారు.



రూ.50కోట్లతో నిర్మించిన కిడ్నీ రీసెర్చ్‌సెంటర్



పూర్తయిన వెంకటాపురం పీహెచ్‌సీ భవనం



అందరికీ అందుబాటులో ఇసుక... పారదర్శక విధానంలో ప్రభుత్వం నిర్దేశించిన ధరకే నాణ్యమైన ఇసుక...

శ్రీకాకుళం జిల్లాలో నియోజకవర్గాల వారీగా రీజనబుల్ రవాణా ఛార్జీలతో కలిపి టన్నుకు ప్రభుత్వం నిర్దేశించిన ఇసుక ధరల వివరాలు ప్రక్కన ప్రకటిస్తున్నాం. జిల్లాలో ఇంతకన్నా ఎక్కువ ధరకు ఎవరైనా మీమీ నియోజకవర్గాల్లో అమ్మితే SEB ఫోన్ నెంబర్ - 089422-27678 కు ఫిర్యాదు చేయండి.. ఎవరైనా ఇంతకన్నా ఎక్కువ ధరకు అమ్మితే 2 లక్షల వరకు జరిమానా, 2 ఏళ్ల జైలు శిక్ష. రెండూ విధిస్తారు. అన్ని రీచ్‌ల వద్ద ఇసుక గరిష్ట అమ్మకపు ధర టన్నుకు రూ. 475/- మాత్రమే...

నియోజకవర్గం పేరు	టన్ను ఇసుక ధర	నియోజకవర్గం పేరు	టన్ను ఇసుక ధర
ఇచ్ఛాపురం	రూ. 930/-	శ్రీకాకుళం	రూ. 780/-
పలాస	రూ. 920/-	ఆమదాల వలస	రూ. 600/-
టెక్కలి	రూ. 810/-	ఎచ్చెర్ల	రూ. 680/-
పాతపట్నం	రూ. 745/-	నరసన్నపేట	రూ. 525/-

★ రాష్ట్రవ్యాప్తంగా ఇసుక మరింత తక్కువ ధరకు అందేలా అన్ని ఓపెన్ రీచ్‌లు అందుబాటులోకి వచ్చాయి..
★ ఇసుక బ్లాక్ మార్కెటింగ్, ట్రాన్స్ పోర్టర్ల సిండికేట్ లకు చెక్ పెడుతూ ఆన్ లైన్‌లో, ఆఫ్ లైన్ తో పాటు గ్రామ/వార్డు సచివాలయాల ద్వారా ఇసుక బుకింగ్ మరియు డోర్ డెలివరీ సదుపాయం..
★ www.andhrasand.com ద్వారా ఇసుక ఆన్‌లైన్ లో బుక్ చేసుకునే సదుపాయం కల్పించిన JPVL సంస్థ..
★ అందరికీ అందుబాటు ధరలో నాణ్యమైన ఇసుక పారదర్శకంగా అందించడమే ప్రభుత్వ లక్ష్యం..

ఫిర్యాదుల కోసం టోల్‌ఫ్రీ నెంబర్ 14500
వినియోగదారుల కోసం హెల్ప్ లైన్ నెంబర్ 97000 09944

శ్రీ వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి

శ్రీ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, విద్యుత్, అటవీ పర్యావరణం, సైన్స్ & టెక్నాలజీ, గనులు, భూగర్భ వనరుల శాఖామాత్యులు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, గనులు మరియు భూగర్భ శాఖ

క్లుప్తంగా

రైతుబజార్లలో తక్కువ ధరకే నాణ్యమైన బియ్యం



రైతుబజారులో బియ్యం విక్రయం ప్రారంభించిన జేసీ నవీన్

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు అతి తక్కువ ధరకే నాణ్యమైన (సూపర్ ఫైన్ రకం) బియ్యాన్ని ప్రజలకు అందించనున్నట్లు జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ తెలిపారు. శ్రీకాకుళం రైతు బజారులో ఏర్పాటుచేసిన బియ్యం విక్రయ కేంద్రాన్ని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ బహిరంగ మార్కెట్‌లో బియ్యం ధరలు అధికంగా ఉన్నాయని, వీటిని అరికట్టేందుకు, సాధారణ ప్రజానీకానికి తక్కువ ధరకే బియ్యం అందిస్తున్నట్లు చెప్పారు. సాధారణ రకం బియ్యం రూ.35, బిపిటి రకం బియ్యం రూ.48గా నిర్ణయించామన్నారు. రైతుబజారుతో పాటు నగరంలో మరో మూడు చోట్ల బియ్యాన్ని విక్రయించనున్నట్లు తెలిపారు. సోమవారం నుంచి ఆమదాలవలస, కోటబొమ్మాళి రైతుబజార్లలో విక్రయ కేంద్రాలు ప్రారంభిస్తామన్నారు. బియ్యం ధరల నియంత్రణకు కమిటీని వేశామని, విక్రయ కేంద్రాలను తనిఖీ చేసి అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు రుజువైతే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా సరఫరాల అధికారి డి.వి.రమణ, మార్కెటింగ్ ఎ.డి.కైలాశరావు, జీఎస్టీ అసిస్టెంట్ కమిషనరల్ రాణిమోహన్, డీటీ గోపాల్, రైతు బజార్ ఈఓ రాజశేఖర్ పాల్గొన్నారు.

అమర జవాన్ల కుటుంబాలకు ఇళ్ల స్థలాలు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: యుద్ధంలో మృతి చెందిన సైనికుల కుటుంబాలకు 300 చదరపు అడుగుల నివాస స్థలాలు మంజూరు చేస్తామని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అన్నారు. జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో శనివారం కలెక్టర్ అధ్యక్షతన జిల్లా సైనిక బోర్డు సమావేశం నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ పదేళ్ల కాలం పైబడి మాజీ సైనికుని కోటాలో మంజూరైన భూములను 22ఎ నుంచి తొలగించేందుకు ప్రతిపాదనలు పంపించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, ఇన్‌చార్జి జిల్లా రెవెన్యూ అధికారి మురళీకృష్ణ, జిల్లా అదనపు సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ ఎ.శైలజ, జిల్లా సైనిక సంక్షేమాధికారి, వైస్ ప్రెసిడెంట్, గ్రూఫ్ కెప్టెన్ పి.ఈశ్వరరావు (రిటైర్డ్) పాల్గొన్నారు.

చోరీ సొత్తు స్వాధీనం



రికవరీ సామగ్రితో సీఐ ఆదాం, ఎస్సై సత్యనారాయణ

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న దొంగతనాలకు సంబంధించిన చోరీసొత్తును పోలీసులు స్వాధీనం చేసుకొని ఇద్దరు నిందితులను శనివారం అరెస్టు చేశారు. ఎచ్చెర్ల పోలీస్ స్టేషన్‌లో జేఆర్‌పురం సీఐ ఆదాం వివరాలు వెల్లడించారు. మార్చిలో అల్లినగరంలోని లక్ష్మీదేవి ఆలయంలో చోరీ, బైక్ మాయం, 2021లో ఆటో అపహరణ కేసుల్లో లావేరు మండలం లోపెంట గ్రామానికి చెందిన కంబాపు రమణను నిందితుడిగా గుర్తించి అరెస్టు చేసినట్లు చెప్పారు. ఫరీదుపేట కూడలి కొయ్యరాళ్ల సమీపంలో జరిగిన చోరీకి సంబంధించి నాలుగు తులాల గొలుసు, మూడున్నర తులాల నల్లపూసలు, రూ.25200 నగదు రికవరీ చేశామన్నారు. ఈ కేసులో రాజమండ్రి ప్రాంతానికి చెందిన నిందితుడు గెద్రెల చిన్నబాబును అరెస్టు చేసినట్లు చెప్పారు. ఎస్సై వి.సత్యనారాయణ పాల్గొన్నారు.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24కి. 10గ్రా.)	60,000–00
బంగారం(22కి. 10గ్రా.)	55,000–00
వెండి (కిలో)	81,800–00


కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 475.00
విజయనగరం	రూ. 479.00
శ్రీకాకుళం	రూ. 479.00

చికెన్

బ్రాయిలర్		
లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹115	₹200	₹ 210

ఖరీఫ్.. రిలీఫ్



వంశధార ఎస్‌ఈ డోల తిరుమలరావు

ఈ ఖరీఫ్‌లో శివారు ఆయకట్టుకు సైతం నీరు అందించడానికి చర్యలు తీసుకున్నామని బీఆర్‌ఆర్ వంశధార ప్రాజెక్టు ఎస్‌ఈ డోల తిరుమలరావు తెలిపారు. ఉపాధి హామీ పనుల్లో ప్రతి గ్రామంలో పిల్ల కాలువలు శుభ్రం చేయాలని సూచించారు. తమ పరిధిలో ఉన్న అంశాల మేరకు సమస్యలను పరిష్కరించి రైతులకు సాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చూస్తామని చెప్పారు. ఖరీఫ్ పనులు జోరుగా జరుగుతున్న సమయంలో ఆయన 'సాక్షి'తో ముచ్చటించారు. – శ్రీకాకుళం (పీఎన్ కాలనీ)

- ఖరీఫ్‌కు పూర్తిస్థాయిలో సాగునీరు అందిస్తాం
- పిల్ల కాలువల పనులు ఉపాధి హామీలో పూర్తి చేసుకోవాలి
- 'సాక్షి'తో వంశధార ఎస్‌ఈ డోల తిరుమలరావు

సాక్షి ఇంటర్వ్యూ

ప్రశ్న: వంశధార కాలువల్లో పూడిక బాగా పేరుకు పోవడం, కొన్ని చోట్ల స్ట్రక్చర్స్ దెబ్బతినడంతో సాగునీటి ప్రవాహానికి ప్రధాన సమస్యగా ఉన్నట్లు తెలుస్తోంది? దీనిపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు?

ఎస్‌ఈ: పూడిక తీత పనులు, మరమ్మతులకు చర్యలు తీసుకున్నాం. గతంలో నరసన్నపేటలో చోటుచేసుకున్న షట్టర్ల అవినీతి కేసు కోర్టులో పెండింగ్‌లో ఉండడంతో కొత్తవి ఏర్పాటు చేసుకోలేని పరిస్థితి నెలకొంది. అయినా శివారుకు నీరు అందించేందుకు శాయశక్తులా ప్రయత్నిస్తాం. ఈ ఏడాది జూన్ మూడో వారంలో నీరు విడిచిపెట్టి శివారు భూములకు తొలుత ఇవ్వాలనుకుంటున్నాం. గొట్టా బ్యారేజీలో 0.5 టీఎంసీ మేర నీరు ఉంది. వర్షాలు పడితే నీటిని విడుదల చేస్తాం. శివారు భూములకు సాగు నీరందకపోవడానికి కాలువల్లో పెద్ద ఎత్తున గుర్రపు డెక్క పేరుకుపోవడమే కారణం.

ప్రశ్న: కాలువలు బాగు చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయా?

ఎస్‌ఈ: కాలువల్లో గుర్రపుడెక్క పెద్దఎత్తున పెరగడంతో సాగునీటి ప్రవాహానికి ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. గుర్రపు డెక్క తొలగింపునకు రూ.50 లక్షల వరకు నిధులు అవసరమవుతాయి. దీనిపై కలెక్టర్‌కు కూడా ప్రతిపాదనలు పెట్టాం.

ప్రశ్న: పూడిక తీతకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?


ఎస్‌ఈ: వంశధారలో పూడిక తీత, రెగ్యులేటర్లు, స్లూయిజ్‌ల మరమ్మతులు చేపట్టేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. ఎడమ కాలువ కోసం రూ.5.50 కోట్లు కుడి కాలువకు రూ.4.50 కోట్లు అవసరమవుతాయి. ప్రభుత్వం ఆమోదం తెలిపిన వెంటనే పనులు చేపడతాం. వంశధార, కుడి ఎడమ కాలువలకు మొత్తం 260 మంది లష్కర్లు కావాలి. ప్రస్తుతం 98 మంది పనిచేస్తున్నారు. సాగునీటి రెగ్యులేషన్ కోసం జిల్లా అవసరాల దృష్ట్యా 130 మంది కావాలని ప్రభుత్వాన్ని అడిగాం. ప్రభుత్వం అనుమతిస్తే అదనంగా లష్కర్లను నియమిస్తాం. లేదంటే పాత వారినే మళ్లీ కొనసాగిస్తాం.

ప్రశ్న: ఆఫ్‌షోర్ పనులు పరిస్థితి ఎలా ఉంది?

ఎస్‌ఈ: గతంలో ఆఫ్‌షోర్ పనులు 38 శాతం జరిగి నిలిచిపోయాయి. ఈ ఏడాది మరో ఏడు శాతం పనులు జరిగాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతులతో మాట్లాడి పునరావాసం, భూసేకరణకు ఉన్న అడ్డంకులను తొలగించాం. రెండేళ్లలో పనులు పూర్తవుతాయి.

ప్రశ్న: షట్టర్ల కుంభకోణం అంశం ఎంత వరకు వచ్చింది?

ఎస్‌ఈ: షట్టర్ల కొనుగోళ్లలో జరిగిన అవినీతిపై 2009లో సీఐడీ కేసు నమోదు చేసింది. దీనిపై నేటికీ హైకోర్టులో విచారణ సాగుతోంది. విచారణ పెండింగ్‌లో ఉండడంతో కాలువలపై కొత్త షట్టర్లను ఏర్పాటు చేసుకోలేని పరిస్థితి నెలకొంది. దీంతో కొత్తగా షట్టర్లు ఏర్పాటు చేసుకోలేక, పాడైన వాటితోనే నెట్టుకురావాల్సిన పరిస్థితి నెలకొంది. నాగావళి–వంశధార నదుల అనుసంధాన పనులు ఇప్పటివరకు 78 శాతం పూర్తయ్యాయి. ఈ ఖరీఫ్‌కు పనులు పూర్తయ్యే అవకాశం లేదు.



ప్రశ్న: హిరమండలం లిఫ్ట్ పనులు ఎప్పుడు ప్రారంభిస్తారు?

ఎస్‌ఈ: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇటీవల హిరమండలం ఎత్తిపోతల పథకానికి భూమి పూజ చేశారు. సర్వే, డిజైన్లు పూర్తయ్యాయి. పంపులు, మోటార్ల కొనుగోలుకు ఏజెన్సీ ఏర్పాట్లు చేస్తోంది. ఈ నెలలో పనులు ప్రారంభించి డిసెంబరులో పూర్తి చేసి నీటిని విడుదల చేసేందుకు ప్రయత్నం చేస్తాం.

ప్రశ్న: కాలువల ఆధునికీకరణ, స్టేజ్–2, ఫేజ్–2 పనులు ఎంత వరకు జరిగాయి?

ఎస్‌ఈ: శిథిలావస్థలో ఉన్న వంశధార ఎడమ కాలువలను ఆధునికీకరించాల్సిందే. దశల వారీగా చేపట్టాల్సిన పనులకు సంబంధించి రూ.950 కోట్ల అంచనా వ్యయంతో ప్రభుత్వానికి నివేదిక పంపించాం. మొదటి దశలో అండర్ టన్నెల్స్, ఆఫ్ టేక్ స్లూయిజ్‌లు తక్షణం పునర్నిర్మించాలి. నిధులు రాగానే ప్రారంభిస్తాం. స్టేజ్–2, ఫేజ్–2కు సంబంధించి ప్యాకేజీ–87, 88 పనులు దాదాపు పూర్తయ్యాయి. హిరమండలం రిజర్వాయర్ పనులు 93 శాతం జరిగాయి. ప్రస్తుతం స్పిల్‌వే పనులు జరుగుతున్నాయి. ఈ ఏడాదిలో పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. గొట్టా బ్యారేజీ వద్ద ఇసుక కొట్టుకుపోయి రాతి పరుపు (ఏప్రాన్) పాడైంది. దాన్ని పునర్నిర్మించేందుకు రూ. 12 కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదనలు పంపించాం. ఇంకా ఆమోదం రావాల్సి ఉంది.

పాఠశాల భద్రతా దినోత్సవ శుభాకాంక్షలు
HPN డిగ్రీ కాలేజ్
(డా.బి.ఆర్. అంబేద్కర్ యూనివర్సిటీ అనుబంధసంస్థ)
ఆర్.టి.సి కాంప్లెక్స్ ఎదురుగా, జిల్లా కోర్టు ప్రక్కన, శ్రీకాకుళం
ఫ్రీ ఎడ్యుకేషన్
SC, ST, BC మరియు EBC విద్యార్థులకు మాత్రమే
మేము అందిస్తున్న కోర్సులు
B.Sc (MPCS, MPC, CBZ),
B.A (HEP, HTP Spl. Telugu) B.Com: General
అడ్మిషన్లు జరుగుచున్నవి
9492266648, 9296257998

ప్రజలకు మెరుగైన సేవలందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా

శ్రీకాకుళం పాతబస్టాండ్: ప్రభుత్వ శాఖాధికారులందరూ ప్రజా సేవకులని, పౌరులకు మెరుగైన సేవలు అందించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ జునైద్ అహ్మద్ మౌలానా, శాశ్వత లోక్ అదాలత్ (ప్రజా ప్రయోజన సేవలు) చైర్మన్ జి.జ్ఞానశ్రీ సువర్ణరాజు సూచించారు. శనివారం స్థానిక న్యాయ సేవా సదన్ కార్యాలయంలో శాశ్వత లోక్ అదాలత్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో హై లెవెల్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ ప్రజా ప్రయోజన సేవలకు భంగం వాటిల్లితే, ఆ వ్యక్తి శాశ్వత లోక్ అదాలత్‌ను ఆశ్రయించవచ్చన్నారు. ఆ విధంగా వచ్చిన కేసులను శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ తీర్మానించి, సమస్యను బట్టి సంబంధిత శాఖలకు ఆదేశాలు జారీచేస్తారని, సమస్య లేకుంటే కేసు ముగిస్తారని వివరించారు. శాశ్వత లోక్ అదాలత్‌పై ప్రజల్లో అవగాహన పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ఇందులో కేసులు చేయడానికి ఎటువంటి ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. ఈ కేసైనా కేవలం 90 రోజుల్లో పరిష్కారమవుతుందని, సివిల్ కోర్టుల్లో మాదిరిగా ఏళ్ల తరబడి నిరీక్షించాల్సిన అవసరం ఉండదని స్పష్టం చేశారు. శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ గృహ నిర్మాణ సంస్థ, రెవెన్యూ, ప్రజా రవాణా సంస్థ, నగర పాలక సంస్థ, తపాలా, బ్యాంకింగ్, ఉపాధిహామీ, నీటిసరఫరా, పారిశుద్ధ్యం, విద్య, భీమా, వైద్య సేవలు, విద్యుత్, టెలిఫోన్ తదితర సేవలు సమాజంలోని పౌరులకు పక్కాగా అందించాల్సిన బాధ్యత ఉద్యోగులపై ఉందన్నారు. సమావేశంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు, నగరపాలక సంస్థ కమిషనర్ ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా బ్యాడ్మింటన్ పోటీలు



బ్యాడ్మింటన్ పోటీలను ప్రారంభిస్తున్న కమిషనర్ చల్లా ఓబులేసు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా బాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గ్లోబల్ న్యూరోకేర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ సౌజన్యంతో శ్రీకాకుళం శాంతినగర్‌కాలనీలో ఉన్న డీఎస్‌ఏ ఇండోర్ స్టేడియం వేదికగా నిర్వహిస్తున్న రెండు రోజులు జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్–2023 పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. శ్రీకాకుళం నగర మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ చల్లా ఓబులేసు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. జిల్లా బాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కిల్లంశెట్టి సాగర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఓబులేసు మాట్లాడుతు క్రీడలతో విశ్వవ్యాప్త గుర్తింపు లభిస్తుందన్నారు. శ్రీకాకుళం నగరంలో ఒక ఇండోర్ స్టేడియం సరిపోవడంలేదని, జాతీయస్థాయి టోర్నమెంట్ల నిర్వహణ సాధ్యంకావడంలేదని సాగర్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లగా మరో ఇండోర్ స్టేడియం నిర్మాణానికి అవసరమైన స్థల కేటాయింపునకు కచ్చితంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా బాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.సాగర్, ప్రధాన కార్యదర్శి మెట్ట అశోక్‌కుమార్, ఎగ్జిక్యూటీవ్ ప్రెసిడెంట్ భైరి దామోదరరావు, గ్లోబల్ న్యూరోకేర్ ఎండీ డాక్టర్ దేవరెడ్డి గౌతమ్, అసోసియేషన్ సీఈవో సంపతిరావు సూరిబాబు, గురుగుబెల్లి ప్రసాద్, ఎంఈ రత్నాజీ, అనీల్‌కుమార్, మెంట శాంతికుమార్, డాక్టర్ రవికుమార్, కోచ్‌లు, అంపైర్లు, టెక్నికల్ సిబ్బంది, గ్లోబల్ న్యూరోకేర్ సిబ్బంది, సీనియర్ క్రీడాకారులు, క్రీడాకారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆరు విభాగల్లో పోరు..

అండర్–11, 13, 15, 17, 19, సీనియర్స్ విభాగాల్లో నాకౌట్ పద్ధతిలో జరుగుతున్న ఈ పోటీల్లో జిల్లా నలుమూలల నుంచి 350 మంది వరకు క్రీడాకారులు ప్రాతినిధ్యం వహించారు. పోటీలకు హాజరైన క్రీడాకారులకు వసతి, భోజన ఏర్పాట్లను కల్పిస్తున్నారు. పోటీలకు చీఫ్ రిఫరీగా అంతర్జాతీయ స్థాయి అంపైర్ సంపతిరావు సూరిబాబు వ్యవహరిస్తారు.

School Safety Day Greetings
CHAKRADHAR MEDICAL - IIT JUNIOR COLLEGE
Palakonda Road, Beside: Saptagiri Function Hall, SRIKAKULAM. Cell: 7330792979, 8106614122
NEET & IIT LONG TERM
Prof. Yalla Chakradhar Rao
(32Yrs Experience)
CHAIRMAN & IIT FACULTY IN MATHEMATICS

School Safety Day Greetings
Kalam's Institute of Vocational Courses
D.C.C.B.E. కాలనీ, శ్రీకాకుళం
కోర్సులు
మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ - MLT
మల్టీపర్పస్ హెల్త్‌వర్కర్ (స్త్రీలు) MPHW (F)
ఎలక్ట్రికల్ టెక్నీషియన్ | డ్రైవింగ్ కోర్సు (LMD)
అర్హత 10వ తరగతి పాస్
★ఇంటర్ + ఒకేషనల్
★హాస్టల్ సదుపాయం కలదు
అడ్మిషన్లు జరుగుచున్నవి
8919296775, 91107377356

రాష్ట్రస్థాయి చెస్ పోటీలు ప్రారంభం



చెస్ పోటీలను ప్రారంభిస్తున్న జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ చౌదరి ధనలక్ష్మి

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా కేంద్రంలోని పీఎన్ కాలనీలో ఉన్న న్యూ సెంట్రల్ స్కూల్ వేదికగా కార్తికేయ స్పోర్ట్స్ అకాడమీ, సీఎస్‌ఎన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రెండురోజులు జరగనున్న రాష్ట్రస్థాయి ఓపెన్ చెస్ పోటీలను శనివారం జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ చౌదరి ధనలక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా టోర్నమెంట్ డైరెక్టర్ చౌదరి సతీష్ మాట్లాడుతూ శ్రీకాకుళంలో త్వరలోనే భారీస్థాయిలో రాష్ట్రస్థాయి చదరంగం పోటీలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ పి.జగన్మోహన్‌రావు, ఆంధ్రా చెస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సనపల భీమారావు, ఏపీ ఎన్జీవో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చౌదరి పురుషోత్తమనాయుడు, సామాజికవేత్త సూర శ్రీనివాసరావు, అంధవరపు సంతోష్, ఆర్కే షాపింగ్ మాల్ కిరణ్, న్యూ సెంట్రల్ స్కూల్ డైరెక్టర్ పి.శ్రీకాంత్, ప్రిన్సిపాల్ బి.మల్లేశ్వరరావు, చౌదరి అవినాష్, చౌదరి సత్యనారాయణ, వేణుగోపాల్, జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు బగాది కిషోర్, కార్యదర్శి జామి రమేష్, వైఎస్‌వికుమార్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా పోటీలు..

తొలిరోజు జరిగిన నాలుగు రౌండ్లలో క్రీడాకారులు ఎత్తుకు పైఎత్తులేశారు. రాష్ట్రం నలుమూలల నుంచి 135 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఇందులో 32 మంది ఇంటర్నేషనల్ రేటెడ్ క్రీడాకారులు పాల్గొనడం విశేషం. శ్రీకాకుళం జిల్లా నుంచి రికార్డుస్థాయిలో 60 మంది ప్లేయర్స్ ప్రాతినిధ్యం వహించారు. పోటీలకు చీఫ్ ఆర్బిటర్‌గా ఫణికుమార్ (విజయవాడ) వ్యవహరిస్తున్నారు.

క్రైమ్ కార్నర్

కాలువలో వ్యక్తి మృతదేహం



కాలువలో ఉన్న మృత దేహం



నారాయణరావు (ఫైల్)

నరసన్నపేట: మండలంలోని గునబపేటకు చెందిన దుప్పట్ల నారాయణరావు(57) మూడు రోజుల క్రితం అదృశ్యం కాగా శనివారం ఆయన మృతదేహాన్ని నరసన్నపేట పోలీసులు ఉర్లాం హైస్కూల్ ఎదురుగా రోడ్డు పక్క కాలువలో గుర్తించారు. రోడ్డు ప్రమాదమే మృతికి కారణమని పోలీసులు నిర్ధారించారు. గురువారం సాయంత్రం నారాయణరావు పని ఉందంటూ ద్విచక్రవాహనంపై బయటకు వెళ్లారు. ఆ రాత్రి ఇంటికి తిరిగి రాలేదు. ఆరా తీసినా ఆచూకీ లేకపోవడంతో అనుమానంతో కుటుంబ సభ్యులు శుక్రవారం నరసన్నపేట పోలీసులకు ఫిర్యాదు ఇచ్చారు. ఈలోగా శనివారం ఉదయం ఉర్లాం ప్రధాన రోడ్డుకు ఆనుకొని స్కూల్‌కు ఎదురుగా ఉన్న కాలువలో తుప్పలు తొలగించేందుకు ఉపాధి వేతనదారులు వెళ్లగా నారాయణ మృతదేహం, అక్కడకు దగ్గర్లో ద్విచక్ర వాహనం గుర్తించారు. వెంటనే నరసన్నపేట పోలీసులకు ఉర్లాం వీఆర్వో ప్రసాదరావు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ వై.సింహాచలం ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. గునబుపేటలో కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వగా వారు పరిశీలించి కన్నీరుమున్నీరయ్యారు. నారాయణరావుకు భార్య రాజకుమారి, కుమారుడు కామేశ్వరరావు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ద్విచక్ర వాహనం ప్రమాదానికి గురి కావడం, రోడ్డు పక్కన 10 అడుగుల లోతులో ఉన్న కాలువల్లో పడిపోవడం, అక్కడ తుప్పలు ఉండటంతో ఎవరూ గుర్తించలేదు. కుమారుడు కామేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పాముకాటుతో వ్యక్తి మృతి

పోలాకి: మండలంలోని పిరువాడ గ్రామానికి చెందిన కరణం లచ్చుమయ్య(59) పాముకాటుతో మరణించాడు. లచ్చుమయ్య శుక్రవారం రాత్రి భోజనం చేశాక అమ్మవారి ఆలయం వద్ద నుంచి నడిచి వస్తుండగా పాము కరిచినట్లు అనిపించడంతో వెంటనే ఆర్‌ఎంపీని సంప్రదించాడు. విష సర్పం కరిచినట్లు నిర్ధారించి అతని సూచన మేరకు నరసన్నపేటలోని ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడు. ఎస్ఐ సత్యనారాయణ కేసు నమోదు చేశారు.


ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య



మృతి చెందిన రమణమూర్తి

శ్రీకాకుళం క్రైమ్: నగరంలో ఓ వ్యక్తి ఆర్థిక ఇబ్బందులతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ ఎస్ఐ బలివాడ గణేష్ పేర్కొన్నారు. రేగిడి మండలం అంబకుండి గ్రామానికి చెందిన పల్లి రమణమూర్తి వ్యవసాయం చేస్తూ మరోవైపు చిల్లర దుస్తుల వ్యాపారం చేస్తుండేవాడు. ఈయనకు భార్య పుష్ప, ఇద్దరు కుమార్తెలు ద్రాక్షాయిని, నందిని ఉన్నారు. శనివారం మధ్యాహ్నం అద్దె ఇంటిలో రమణమూర్తి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు.

ద్విచక్ర వాహనం ఢీకొని మహిళ మృతి



పకీర్(ఫైల్)

టెక్కలి రూరల్: బొప్పాయిపురం జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో శ్యామసుందరాపురం గ్రామానికి చెందిన అడపా పకీర్(56) అనే మహిళ మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పకీర్ తన గ్రామం నుంచి బొప్పాయిపురం ఆటోలో వచ్చింది. రోడ్డు దాటుతుండగా పలాస నుంచి శ్రీకాకుళం వైపు వెళ్తున్న ద్విచక్రవాహనం ఢీకొనడంతో ఇద్దరూ గాయపడ్డారు. క్షతగాత్రులను టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా మహిళ మృతిచెందింది. పకీర్‌కు భర్త బాబా ఉన్నారు. టెక్కలి ఎస్ఐ–2 రమేష్‌బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దొంగతనం కేసులో ముగ్గురి అరెస్టు

టెక్కలి రూరల్: స్థానిక పాలకేంద్రం సమీపంలో ఈ నెల 13వ తేదీ అర్ధరాత్రి కోరాడ సతీష్ ద్విచక్రవాహనం నగదు, బ్యాగ్‌ను చోరిచేసిన ఘటనలో ముగ్గురిని శనివారం అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా చోరీకి పాల్పడిన వారు కర్రి బోగేశ్వరరావు (సీతారాంపల్లి), సానిల పవన్, గేదెల కుమార్(టెక్కలి)లను అరెస్ట్ చేశామన్నారు. వీరి వద్ద నుంచి బ్యాగు, రూ.8వేలు నగదు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

సాక్షి సండే క్లాసిఫైడ్స్

EDUCATION
■ VEDA Educational Consultancy: For B.E / B.Tech / B.Pharm / Pharm - D / B.B.A+M.B.A / M.S Food Science, MBA / M.Sc / M.A / Ph.D Seats in AU Campus / Universities / Colleges. Ph : 93475 62708 [V-794575]

PLOT FOR SALE
■ శ్రీకాకుళం టౌన్ నవభారత్ జంక్షన్ హైవేకు ఆతిచేరువలో సాయిదత్త లేఅవుట్‌కు ఆనుకుని పంచాయితీ అప్రూవ్ లే అవుట్‌లో 30 అడుగుల రోడ్డు గల 4 సెంట్లు, 5 సెంట్లు బిట్లు నార్త్ మరియు సౌత్ ఫేసింగ్‌లో కలవు. సెల్: 9347080466, 9989592379 [S-771042]

TO-LET
■ శ్రీకాకుళం ఫారెస్ట్ ఆఫీస్ వెనుక రెల్లవీధిలో G+2 కమర్షియల్ బిల్డింగ్ (Each ఫ్లోర్ – 3200 SFT) అద్దెకు ఇవ్వబడును. సంప్రదించండి. సెల్: 9441729491 [S-771044]
■ శ్రీకాకుళం పెద్దపాడు రోడ్‌లో యమహా షోరూమ్ ప్రక్కన కెనరా బ్యాంక్ ఉన్న గ్రౌండ్‌ఫ్లోర్ బిల్డింగ్ స్ట్రాంగ్ రూమ్స్‌తో ఉన్నది. బ్యాంక్/ ఆఫీసులకు అద్దెకు ఇవ్వబడును. సెల్: 8977998886, 9440115673 [S-771034]

GODOWNS LEASE
■ Lease, Godown-PEB Structure Suitable For MSME, Stock Points Hospitals, Logistics, Abutting to High way, Etcherla, Srikakulam. Ph : 94414 40553 [V-794583]

BUSINESS OFFER
■ ఇంటి వద్ద నుండే వ్యాపారం (పార్ట్ టైమ్ & ఫుల్ టైమ్) ప్రముఖ న్యూట్రిషన్ & వెయిట్ మేనేజ్‌మెంట్ కంపెనీలో వెల్‌నెస్ కన్సల్టెంట్‌గా చేయుటకు ఇంట్రెస్ట్ ఉన్నవారు సంప్రదించగలరు. అందరూ అర్హులే. ✆ : 93470 63794 [R-5990]
■ హైదరాబాద్ లో కొత్తగా ప్రారంభించిన కంపెనీ కొరకు బిజినెస్ పార్టనర్స్ & ఇన్వెస్టర్స్ (పెట్టుబడి దారులు) కావలెను. రమ్య : 8143614379 [HA-13942]

■ S.Foundationకంపెనీకిప్రాతినిధ్యంవహించడానికి ఆంధ్రప్రదేశ్, తెలంగాణలలో కనీస అర్హతను కల్గి మంచి నైపుణ్యం కల్గిన ఏజెంట్స్ కావలెను. జీతం+Incentives ఇవ్వబడును.9045058168. [T-1191473]

ASTROLOGY
■ ICAS వైజాగ్ ❖ జ్యోతిష్యం ❖ వాస్తు సర్టిఫైడ్ డిప్లొమా కోర్సులు ❖ ఆన్‌లైన్‌లో నేర్పబడును. తేది.29-07-23 క్లాసులు ✆ : J. శ్రీనివాస్, 99666 66659, www.icasindia.org [V-7458]

MARRIAGE SERVICES
■ అన్ని కులముల వారికి ప్రథమ మరియు ద్వితీయ పెండ్లి సంబంధములు కుదర్చబడును. శ్రీ శ్రీనివాసా మ్యారేజ్ లింక్స్, శ్రీకాకుళం. ఫోన్ : 82475 99336, వాట్సాప్ : 91771 63987 [V-2010]

WANTED
■ Wanted Teachers for LKG, UKG, Ist prefer english talking, A.S SCHOOL. Cont: 8317548423 [S-771043]
■ IRPM కంపెనీ శ్రీకాకుళంలో వివిధ మండలాల్లో నూతనంగా ప్రారంభించే బ్రాంచిలో BMMTలో చేయుటకు Q:10th, ఇంటర్ చదివిన 50 మంది యువతీ యువకులు కావలెను. Income: 12,000 - 22,000/-. 9849553548 [WA-7000]
■ గుంటూరు సమీపములో గల ఆఫీసులో ఉండి పనిచేయుటకు టైపింగ్, డ్రైవింగ్ చేయగల జూనియర్ లాయర్లు & కనీసం 10th చదివిన డ్రైవర్లు కావలెను. ✆ 7207007725 / 9666114383 [G-781708]
■ బ్యాంకింగ్ రంగంలో పనిచేయుటకు 10th, to డిగ్రీ చదివిన ఫ్రెషర్స్ Female కంప్యూటర్ ఆపరేటర్స్, రిసెప్షనిస్ట్, టెలికాలర్స్ ప్రోసెసింగ్ మేనేజర్స్ కావలెను. ఫోన్ : 93938 98904 [V-794579]
■ కన్సల్టెన్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి M/F ఆయా, నర్సులు, వంట చేయువారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ: 12000-35000/- ఫ్రీ రూమ్ + భోజనం. Hyd. ఫోన్ : 7995374999. [HA-395]
■ MS కంపెనీ నందు ఇంటి నుంచి పార్ట్‌టైమ్/ ఫుల్ టైమ్‌వర్క్ చేయుటకు టెలికాలర్స్ కావలెను. మేల్/ ఫీమేల్, Qly: 10th, జీతం: 16,000 –18,000, Ph: 9948969231, 8008860389 [HA-400]
■ షిర్డీసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్‌లో పనిచేయుటకు లేడీవార్డెన్స్, ఆయాలు, భార్యభర్తలు, డ్రైవర్స్ కావలెను. Ph: 9391036931, 9246585901 [HA-11279]
■ JOB VACANCY: TIK PVT. LTD. Age: 18 to 45 yrs, Qul: 10th to Any Degree, Salary: 18000/- to 25000/- Contact: ✆ 7207833091. [T-774207]
■ హన్మకొండజిల్లాలోని స్వచ్ఛంద సంస్థలో మగ పిల్లలకు పనిచేయుటకు మగవాళ్ళు 45సం॥ల వయస్సు గల వారు కావలెను. భోజనము+ వసతి కల్పించబడును. నెలకు రూ.7000/- ఇవ్వబడును. 9849038142. [WA-13191]
■ హన్మకొండజిల్లాలోని స్వచ్ఛంద సంస్థలో వాచ్‌మెన్‌గా పనిచేయుటకు పురుషులు 45 సం॥లపై వయస్సు గల వారు కావలెను. భోజనము+ వసతి కల్పించబడును. నెలకు రూ.6000/- ఇవ్వబడును. 9849038142. [WA-13190]
■ తెలుగు రాష్ట్రాల నిరుద్యోగ యువతకు గొప్ప అవకాశం. Online మెగా Opportunity మేళా. వర్క్ ఫ్రం హోం. అర్హత: ఇంటర్ to PG. నో Exam, No Fee. వివరాలకు ✆ 84660 07062 [B-236]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.